

వరకట్న వేధింపులతో మహిళ ఆత్మహత్య
• కోయిలకొండ మండలం రాంపూర్‌లో ఘటన
7

పాలమూరే ముద్దు.. వికారాబాదే కావాలి
• గండీడ్, మహ్మదాబాద్ మండలాలను కలపడంపై పోటాపోటీగా సమావేశాలు
6

అంగన్‌వాడీల్లో.. కూరగాయల సాగు

• పోషణ్ వాటికల పేరుతో ఏర్పాట్లు
• జిల్లా వ్యాప్తంగా 130 కేంద్రాల గుర్తింపు
• ఒక్కో కేంద్రానికి రూ.10 వేలు మంజూరు చేసిన కేంద్రం
• విత్తనాల పంపిణీ పూర్తి
• ఈ వారంలో ప్రారంభించేందుకు సన్నాహాలు



ఏనుగొండలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న ఖాళీ స్థలం



మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతల సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చర్యలు తీసుకుంటున్నాయి. అందులో భాగంగానే కేంద్రాలలో ఇకపై కూరగాయలు, ఆకుకూరలు పండించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. అందుకు పోషణ్ వాటిక అని పేరు పెట్టాయి. జిల్లా వ్యాప్తంగా 130 కేంద్రాలను ఎంపిక చేయడంతో పాటు తోటల నిర్వహణ కోసం ఒక్కో కేంద్రానికి రూ. 10 వేలు కూడా మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశాయి. కూరగాయల విత్తనాలు కూడా పంపిణీ చేశాయి. ఈ వారంలో పోషన్ వాటిక కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

130 కేంద్రాల గుర్తింపు

జిల్లాలో మొత్తం 4 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి పరిధిలో 1,163 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. కూరగాయల సాగుకు స్థలం అనుకూలంగా ఉన్నవి 130 కేంద్రాలను గుర్తించారు. మహబూబ్‌నగర్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో 28, మహబూబ్‌నగర్ రూరల్‌లో 48, దేవరకద్రలో 20, జడ్చర్ల ప్రాజెక్టు పరిధిలో 34 ఎంపిక చేశారు. ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో, స్వంత భవనంలో కొనసాగుతున్న కేంద్రాలకు మొదటి ప్రాధాన్యం ఇచ్చారు. కూరగాయలు సాగు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక్కో కేంద్రానికి రూ.10 వేలు కేటాయించింది. 130 కేంద్రాలకు గాను ఒక్కో కేంద్రానికి రూ.10 వేల చొప్పున 130 కేంద్రాలకు రూ.1.30 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి అందించింది. ఆ నిధులను ఎలా, ఎందు కోసం ఖర్చు చేయాలనే దానిపై రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయనుంది. ఆ ప్రకారం ఆయా కేంద్రాలకు త్వరలో నిధులు రానున్నాయి.

విత్తనాల పంపిణీ పూర్తి

కూరగాయలు సాగుచేసే కేంద్రాలకు ఇప్పటికే విత్తనాలు పంపిణీ ప్రారంభమైంది. ఈమేరకు కేంద్ర ప్రభుత్వం జాతీయ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా వాటిని అందజేసింది. అన్ని కేంద్రాలకు పంపిణీ చేశారు. అందులో టమాట, బెండ, ముల్లంగి, మునగ, ఆకు కూరలు, ఇతర కూరగాయలు ఉన్నాయి.



కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేసిన విత్తనాల ప్యాకెట్లు

పోషణ్ వాటికల ఏర్పాటుకు చర్యలు



జిల్లాలోని 130 కేంద్రాలలో పోషణ్ వాటికలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అంగన్‌వాడీ టీచర్లకు ఆకు కూరలు, కూరగాయల సాగుపై ఉద్యానశాఖ అధికారులతో శిక్షణ ఇప్పిస్తాం. ఇప్పటికే విత్తనాల ప్యాకెట్లు పంపిణీ చేశాం. కేంద్రాల ఆవరణలోనే పెంపకం చేస్తుండటంతో చిన్నారులకు తాజా కూరగాయలతో పౌష్టికాహారాన్ని అందించేందుకు అవకాశం ఉంది. ఈ వారంలో కార్యక్రమాన్ని అమలు చేస్తాం.

- జరీనాబేగం, జిల్లా సంక్షేమాధికారి, మహబూబ్‌నగర్

వంట పాత్రలు వచ్చాయ్

• నారాయణపేట జిల్లాలోని 375 ప్రభుత్వ స్కూళ్లకు రాక
• ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిల్వ
• త్వరలో పాఠశాలలకు పంపిణీ



నారాయణపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉంచిన వంట పాత్రలు

నారాయణపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం పథకంలో విద్యార్థులకు భోజనాలు వండేందుకు ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం కొత్త వంట పాత్రలను అందించనుంది. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 375 ప్రభుత్వ పాఠశాలలకు రూ.66.80 లక్షల విలువైన వంట పాత్రలు వచ్చాయి. మొత్తం ఏడు రకాల పాత్రలు, గంటెలు వచ్చాయి. అందులో పెద్ద సైజు, చిన్న సైజు బొగొండిలు, బేసన్లు, స్టీల్ బకెట్లు, కూర గంటెలు, అన్నం గంటెలు, అన్నం కలిపేందుకు పెద్ద జాలి గంటెలు ఉన్నాయి. జిల్లాలో 463 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు అవుతుండగా, రోజుకు దాదాపు 50 వేల మంది వరకు విద్యార్థులు భోజనం చేస్తున్నారు. విద్యాశాఖ అధికారులు అవసరమని గుర్తించిన పాఠశాలలకు కొత్త వంట పాత్రలను అందించనున్నారు.



జిల్లాకు వచ్చిన కొత్త బకెట్లు, బేసన్లు

త్రిసభ్య కమిటీ పర్యవేక్షణ

కొత్తగా వచ్చిన వంట పాత్రలను స్థానికంగా ఉంచేందుకు స్థలం లేకపోవడంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉంచారు. వంట పాత్రల నాణ్యతను అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆధ్వర్యంలో త్రిసభ్య కమిటీ సభ్యులు డీఈవో గోవిందరాజులు, మధ్యాహ్న భోజన పథకం జిల్లా ఇన్‌చార్జి యాదయ్యశెట్టి పర్యవేక్షించనున్నారు. 2010లో ఇచ్చిన వంట పాత్రలు పాతవి కావడంతో పాటు పాత్రల కొరతను గుర్తించిన ప్రభుత్వం కొత్త పాత్రల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే నారాయణపేట మండలం జాజాపూర్ ప్రభుత్వ పాఠశాలకు కొత్త వంట పాత్రలను ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి పంపిణీ చేశారు. మిగతా పాఠశాలలకు మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డిల చేతుల మీదుగా అందించనున్నారు.

చెక్ డ్యాంలో పడి వ్యక్తి మృతి

చిన్నచింతకుంట , ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెక్ డ్యాంలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన చిన్నచింతకుంట మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాంలాల్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సంఘమోని రాము (39) చేపలు పట్టడానికి గ్రామ సమీపంలో ఊక చెట్టు వాగులో నిర్మించిన చెక్ డ్యాం వద్దకు వెళ్లాడు. చేపలు పడుతుండగా, ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయాడు. స్థానికులు గుర్తించి మృతదేహాన్ని వెలికి తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతనికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రాము భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

అభివృద్ధి పనుల జాతరకు
రూ.2,200 కోట్లు

పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క

• అమ్రాబాద్ మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మాధవానిపల్లిలో పంచాయతీ భవనానికి భూమి పూజ చేస్తున్న మంత్రి సీతక్క

అమ్రాబాద్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పనుల జాతరలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 1500 పనుల గాను ప్రభుత్వం రూ.2,200 కోట్లు కేటాయించిందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని జంగంరెడ్డిపల్లి, కల్ములోనిపల్లి, మాధవానిపల్లి, తుర్కపల్లి, గ్రామపంచాయతీ నూతన భవనాలకు అచ్చంపేట శాసన సభ్యులు డాక్టర్ వంశీకృష్ణ తో కలిసి మంత్రి సీతక్క భూమి పూజ చేశారు. అనంతరం జంగంరెడ్డిపల్లిలో ప్రజలను ఉద్దేశించి మంత్రి సీతక్క మాట్లాడారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అన్నింటిని నెరవేర్చడం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తోందని వెల్లడించారు. ముఖ్యంగా మహిళలకు ఆర్థిక స్వాతంత్రం కల్పించడం కోసం తమ ప్రభుత్వం సమగ్ర ప్రణాళికన రూపొందించి అమలు పరిచిందని అన్నారు. అందులో భాగంగానే ఇప్పటివరకు వివిధ జిల్లాల్లో మహిళా సంఘాలకు రూ.17 కోట్ల 81 లక్షలను వడ్డీ లేని రుణం కింద పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. 60 సంవత్సరాలు పైబడిన మహిళలను సంఘాల నుంచి తొలగిచకుండా వారిని కూడా జీవితాంతం సంఘాలలోనే కొనసాగించే విధంగా

(మిగతా 6లో..)

వినాయక ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలి

• టెలీకాన్ఫరెన్స్‌లో పోలీసులకు సూచించిన ఎస్పీ జానకి

మహబూబ్ నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని బందోబస్తు నిర్వహించాలని ఎస్పీ జానకి పోలీస్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆమె తన కార్యాలయం నుంచి జిల్లా పోలీస్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వేడుకలు ముగిసేవరకు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వివాదాస్పద ప్రదేశాలలో, వాహనదారులకు ఇబ్బందులు కలిగించేలా రహదారులకు అడ్డంగా మండపాలు ఏర్పాటు చేయొద్దన్నారు. అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు, అత్యవసర సేవలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శాంతి సామరస్య వాతావరణం ఉండేలా ప్రతీ ఒక్కరు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



పనులను ప్రారంభిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

కోనేరు సుందరీకరణ ప్రారంభం

• బ్రహ్మోత్సవాల నాటికి పూర్తి చేస్తాం
• రాష్ట్ర క్రీడా, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి ఆలయ కోనేరు సుందరీకరణ పనులను రాష్ట్ర క్రీడా, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరులో నిర్వహించే బ్రహ్మోత్సవాల నాటికి పనులు పూర్తి చేస్తామని చెప్పారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్లే కోనేరు అపరిశుభ్రంగా మారిందన్నారు. కోనేరును తిరుమల, యాదగిరిగుట్ట తరహాలో సర్వాంగ సుందరంగా తయారు చేస్తామన్నారు. ఆర్కిటెక్ కల్పన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వందకుపైగా కోనేరులను సుందరీకస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ప్రాణేశాచారి, ఈవో శ్యాంసుందర్‌చారి, మున్సిపల్ ఏఈ నాగశివ, మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్‌కుమార్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏ.రవికుమార్, కట్ట సురేశ్‌కుమార్, గోలపల్లి నారాయణ, కావలి తాయప్ప, కావలి ఆంజనేయులు పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు
నేడు వెబ్ ఆప్షన్లు

• పాఠశాల విద్యాశాఖకు తుది జాబితా
• రేపు నియామక ఉత్తర్వులు
• జిల్లాలో భర్తీ కానున్న 168 పోస్టులు



జాబితాను సిద్ధం చేస్తున్న విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రకియ చివరి దశకు చేరింది. జిల్లాలో పోస్టులకు సంబంధించి తుది జాబితాను సిద్ధం చేసిన జిల్లా అధికారులు ఆదివారం పాఠశాల విద్యాశాఖకు పంపించారు. ఈ జాబితా ఫైనల్ కావడంతో అందులో ఉన్న వారంతా పాఠశాలల ఎంపిక కోసం సోమవారం వెబ్ ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. ఆ మరుసటి రోజు పదోన్నతులు పొందిన ఉపాధ్యాయుల కు నియామక ఉత్తర్వులు ఇస్తారు. వెంటనే పాఠశాలల్లో చేరాల్సి ఉంటుంది. జిల్లాలో 168 పోస్టులు పదోన్నతుల ద్వారా భర్తీ కానున్నాయి. ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ మీడియాలకు సబంధించి గణితం 8, జీవశాస్త్రం 14, భౌతిక శాస్త్రం 7 పోస్టులు భర్తీ అవుతాయి. వాటితో పాటు సాంఘిక శాస్త్రం 35, తెలుగు 26, హిందీ 16, పీడీ 10, పీఎస్ హెడ్‌మాస్టర్ 33, ఉర్దూ 9 పోస్టులు భర్తీ కానున్నాయి.

నిజం తెలిసే లోపే
అబద్ధం ప్రపంచాన్ని చుట్టేస్తోంది

• ఆటో డ్రైవర్‌కు ఫిట్స్ వస్తే యూరియా కోసం వచ్చాడని నమ్మించే ప్రయత్నం
• ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



రేషన్ కార్డు ప్రొసీడింగ్ అందిస్తున్న ఎమ్మెల్యే

హన్వాడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నిజం తెలిసే లోపే అబద్ధం లోకాన్ని చుట్టేస్తోందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హన్వాడలో ఆదివారం రేషన్ కార్డు ప్రొసీడింగ్స్, కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమనికి ఎమ్మెల్యే ముఖ్య అథితిగా హాజై మాట్లాడారు. గత ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన వ్యక్తి ఒక ఆటో డ్రైవర్‌కు ఫిట్స్ వస్తే, యూరియా కోసం వచ్చి స్పృహతప్పి పడిపోయాడని నమ్మించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. మండలంలో 9,511 మంది పేర్లు రేషన్‌కార్డుల్లో నమోదు చేశామన్నారు. అందరికీ బియ్యం వస్తాయన్నారు. 41 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు అందించడం జరిగిందన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్మించిన మోడల్ ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే ప్రారంభించారు. బాలాజీ కొండపై షెడ్డు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనిత పాల్గొన్నారు.

పాఠశాలల్లో క్రీడా పండుగ
• ప్రారంభమైన మండల, జిల్లా స్థాయి జట్ల ఎంపికలు
7

యూరియా కోసం రైతుల క్యూ
• హన్వాడలో బారులు తీరిన రైతులు
6

పాలమూరే ముద్దు.. వికారాబాదే కావాలి


నంచర్ల గేట్‌లోని ఓ ఆడిటోరియంలో సమావేశం అయిన నాయకులు

● గండీడ్, మహమ్మదాబాద్ మండలాలను కలపడంపై పోటాపోటీగా సమావేశాలు

మహమ్మదాబాద్ ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విభజన పారదర్శకంగా జరగలేదని గండీడ్, మహమ్మదాబాద్ మండలాలను పాలమూరు జిల్లాలో కలపడంతో రెండు మండలాల ప్రజలు అన్ని విధాలా నష్టపోయామని కొందరు.. మరి కొందరు మాత్రం చదువుకున్న వారికి ఎక్కడైనా ఉద్యోగాలు వస్తాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదివారం గండీడ్, మహమ్మదాబాద్ మండలాలకు చెందిన పలు పార్టీల నాయకులు నంచర్ల గేట్ పల్లవి ఆడిటోరియంలో రెండు మండలాలను వికారాబాద్ జిల్లాలో కలపాలని సమావేశం నిర్వహించారు. మహమ్మదాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమావేశ మందిరంలో మహమ్మదాబాద్ మండలానికి చెందిన నాయకులు సమావేశం నిర్వహించి పాలమూరు ముద్దు.. వికారాబాద్ వద్దు అంటూ సంతకాలు చేశారు. మాకు వికారాబాద్ జిల్లా వద్దు మహబూబ్‌నగర్ రూరల్ అసెంబ్లీ కేంద్రంగా హన్వాడ, కోయిలకొండ, నవాబ్‌పేట, మహమ్మదాబాద్, మహబూబ్‌నగర్ రూరల్ మండలాలను కలిపి అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటు చేయాలని కొందరు సమావేశం నిర్వహించారు. దీంతో పోటాపోటీగా సమావేశాలు సాగాయి. నంచర్ల గేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఎక్కువ మంది నాయకులు, యువకులు మాత్రం అసెంబ్లీ నియోజక వర్గాల పునర్విభజనలో రెండు మండలాలు ఒకే నియోజకవర్గం, ఒకే జిల్లాలో ఉండే విధంగా కలిసికట్టుగా పోరాడి సాధించుకోవాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. మొత్తంగా నియోజకవర్గాల విభజన చేపడుతారనే చర్చ సాగుతుండటంతో రెండు మండలాల నాయకులు సమావేశాలు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. నాయకులు బీజేపీ రాములు, కేఎం నాఅయణ, వెంకట్‌రాంరెడ్డి, మాచారం శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి, అనంత్‌రెడ్డి, పీఈటీ రాములు, గఫర్‌ఖాన్, గోపాల్‌రెడ్డి, వెంకటయ్య, దిడ్డికాడి గోపాల్, దానకారి రవి, దస్తయ్య, వేణుగౌడ్ పాల్గొన్నారు.


మహమ్మదాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న వేణుగౌడ్

ఆర్టీసీ బస్సు-బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

వెల్దండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు- బైక్ ఢీ కొని ఒకరికి గాయాలయ్యాయి. హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారిలో మండలంలోని పెద్దాపూర్ సమీపంలో ఆర్టీసీ బస్సు బైక్ ఢీకొని ద్విచక్రదారుడు గాయపడ్డాడు. కల్వకుర్తి నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా ఉన్న లారీని అధిగమించబోయి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో వనపర్తికి చెందిన ద్విచక్రదారుడు గాయపడ్డాడు. అతడిని వెంటనే చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కల్వకుర్తిలో మరొకరికి..

కల్వకుర్తి, (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్ ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఒకరు గాయపడ్డ ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు కల్వకుర్తి పట్టణంలో ఆదివారం సాయంత్రం ఓ ట్రాక్టర్ రివర్స్ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై వెల్దండ మండలం కుప్పగండ్ల గ్రామానికి బయల్దేరిన గుంటి వెంకటేశ్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వెంకటేశ్‌ను చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైద్రాబాద్‌కు తరలించారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

● ఏఐయూకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్
● మహబూబ్‌నగర్‌లో ప్రచార రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఏఐయూకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్

పాలమూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని కోరుతూ ఏఐయూకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్ ఆదివారం జిల్లా కేంద్రంలో ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమ, మంగళవారాల్లో జిల్లా కేంద్రంలోని సుదర్శన్ హాలులో రాష్ట్ర ప్రథమ మహా సభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ప్రజలందరికీ అన్నం పెడుతున్న రైతు ఆపదలో ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలన్నారు. అందరికీ తిండి పెడుతున్న రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర చెల్లించాలన్నారు. ఏఐయూకేఎస్ పశ్చిమబెంగాల్ నాయకులు పరితోష్ దాస్, షిబ్‌గిరి మాట్లాడుతూ రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నా కేంద్రం పట్టించుకోవటంలేదన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ, రాము, టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్, రామకృష్ణ, రఫీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి

కార్మికుల సమస్యలపై పోరాటం

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి

పాలమూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఉత్పత్తి రంగాల్లో పనిచేసే కార్మికుల సమస్యలపై పోరాటం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా జనరల్ బాడి సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్కీం వర్కర్లు, అసంఘటిత కార్మికులు, సాంప్రదాయ కార్మికులే కాకుండా ఉత్పత్తి రంగాల్లో పనిచేసే కార్మికులు, కీలకమైన పరిశ్రమలు, విద్యుత్, ట్రాన్స్‌పోర్టు, రైల్వే రంగాల్లో పనిచేసే వారి సమస్యలపై పోరాటం ఉధృతం చేయాలన్నారు. జడ్చర్ల, పోలేపల్లి సెజ్, బాలానగర్ నుంచి అడ్డాకుల వరకు ఉన్న పరిశ్రమల్లో కీలకమైన కార్మికులను సంఘటితం చేయటానికి సంఘాల ఏర్పాటు చేయాలన్నారు. కిల్లె గోపాల్, నల్లవెల్లి కురుమూర్తి మాట్లాడుతూ జిల్లాలోని పరిశ్రమల్లో వలస కార్మికులే అత్యధికంగా పనిచేస్తున్నారని తెలిపారు. బోనసు, గ్రాట్యూటీ ఎలాంటి హక్కులు లేకుండా యాజమాన్యాలు పనిచేయించుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయేతర, అసంఘటిత రంగ కార్మికులు, వలస కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ఖమర్‌అలీ, వేణుగోపాల్, రాజ్, చంద్రకాంత్, ఆంజనేయులు, నారాయణ పాల్గొన్నారు.


హన్వాడ బ్యాంక్ ఆవరణలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

యూరియా కోసం రైతుల క్యూ

హన్వాడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా మండల కేంద్రమైన హన్వాడలో ఆదివారం బ్యాంక్ ఆవరణలో యూరియా కోసం రైతులు ఒక పక్క క్యూ కట్టారు. అదే బ్యాంక్ ఆవరణలో మరో పక్క ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి రేషన్‌కార్డులు, కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం కొనసాగింది.


లైన్లో రావాలని రైతులకు చెబుతున్న ఎస్ఐ

అభివృద్ధి పనుల జాతరకు రూ.2200 కోట్లు

పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క


అభివృద్ధి పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరణ చేసిన మంత్రి సీతక్క

(5వ పేజీ తరువాయి..)

నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రాంతానికి సాగునీరుతో పాటు కృష్ణానది పై మద్దిమడుగు వద్ద వంతెన 220/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణంతో పాటు అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించే విధంగా తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, డీఆర్‌డీఏ చిన్న ఓబులేసు, అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు, అమ్రాబాద్ ఎంపీడీవో లింగయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ లేని రుణాలతో ఆర్థిక పరిపుష్టి : మంత్రి సీతక్క

వెల్దండ : రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు ఇస్తున్న వడ్డీ లేని రుణాలతో ఆర్థిక పరిపుష్టి సాధించుతామని మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం హైదరాబాద్ నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రికి పెద్దపూర్ వద్ద పార్టీ నాయకులు, మహిళలు స్వాగతం పలికారు. మన ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో వడ్డీలేని రుణాలను ఇస్తోందన్నారు. ప్రతీ మహిళ స్వయం సహాయక సంఘంలో చేరి ఆర్థికంగా ఎదగాలని సూచించారు.

సురవరం మృతి పీడిత ప్రజలకు తీరని లోటు

- సురవరం సుధాకర్‌రెడ్డి మృతదేహానికి మంత్రి జూపల్లి నివాళి

కొల్లాపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ దిగ్గజం, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మరణం తాడిత, పీడిత ప్రజలకు తీరని లోటు మిగిల్చిందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం మహానగరంలో హిమాయత్ నగర్‌లో ఉన్న సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్‌లో సురవరం సుధాకర్‌రెడ్డి భౌతిక కాయానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడే ఉన్న సురవరం సతీమణి విజయలక్ష్మి, వారి కుమారులు కపిల్, నిఖిల్‌లను పరామర్శించారు. అనంతరం సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా, జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావులను కలిశారు. మంత్రి విలేకరులతో మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం పేద ప్రజల పక్షాన పోరాటాలు చేశారని అన్నారు.

డిక్లరేషన్ ప్రకారం ఐటీడీఏలు ఏర్పాటు చేయాలి

- తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్

అచ్చంపేటటౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ చేవెళ్లలో సభలో ప్రకటించిన డిక్లరేషన్ ప్రకారం రాష్ట్రంలో మైదాన, ఏజెన్సీల ప్రాంతాల్లో 5 ఐటీడీఏలు ఏర్పాటు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని టీఎన్‌జీవో భవనంలో తెలంగాణ గిరిజన సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశం సంఘం జిల్లా అధ్యక్షుడు సభావట్ అశోక్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు 12శాతానికి పెంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో అమలు చేసి తీరుతామని ఇచ్చిన మాట ఏమైందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఆదివాసి, ఎరుకల, సేవాలాల్ పేర్లతో కార్పొరేషన్లు ఏర్పాటు చేసి సంవత్సరానికి రూ.5000 కోట్లు కేటాయించి గిరిజన తండాలు చెంచుగూడేల అభివృద్ధి కోసం దోహదపడతామని ఇచ్చిన మాటను విస్మరించారని ఎద్దేవాచేశారు.

కార్యక్రమంలో గిరిజన సంఘం గౌరవాధ్యక్షుడు దేశ్యానాయక్, జిల్లా కార్యదర్శి శంకర్ నాయక్, నాయకులు లక్పతి, దశరథం, హరీష్ నాయక్, వాల్యానాయక్, రమేష్, మల్లేష్, వెంకటేష్, శ్రీను, నరేందర్, అనిత పాల్గొన్నారు.


టీఎన్‌జీవో భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్

సిర్సవాడ వద్ద కాజ్‌వేకు పగుళ్లు

- రాకపోకలకు అనువుగా లేని రహదారి

తాడూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్సవాడ వద్ద దుందుభీ నదిలో ఉన్న కాజ్‌వే ఇటీవల వచ్చిన నది ప్రవాహానికి పూర్తి స్థాయిలో కాజ్‌వే చెల్లాచెదురై నడవరాని పరిస్థితి నెలకొంది. వరద ప్రవాహం కొంత తగ్గడంతో దుందుభి నదిలోని కాజ్‌వే నగ భాగం బయటకు రావడం జరిగింది. కాజ్‌వే చూసిన ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి పరిస్థితిలో ఎలా నడవాలని ఆవేదన చెందుతున్నారు. అన్నదాతలు ప్రతి నిత్యం నది అవతలికి వెళ్లి రావాల్సిన పరిస్థితి ఉన్న నేపథ్యంలో కాజ్‌వే పూర్తిగా దెబ్బతింది. కావున ప్రజాప్రతినిధులు, పంచాయతీరాజ్ అధికారులు స్పందించి దుందుభి నదిలోని కాజ్‌వేపై తాత్కాలిక మరమ్మతులు చేపట్టి కనీసం మనుషులు నడిచే విధంగా చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.


సిర్సవాడ వద్ద పగిలిపోయిన కాజ్‌వే

లీగల్ ఫోరం ఫర్ తెలంగాణ జిల్లా అధ్యక్షుడిగా కాసీం

తెలకపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో ఉన్న న్యాయ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అడ్వకేట్ ప్రొటెక్షన్ చట్టం సాధన కోసం ఇతర సామాజికి సమస్యల పరిష్కారం కోసం ఉస్మానియా విశ్వవిద్యాలయం వేదికగా ఏర్పాటైన లీగల్ ఫోరం ఫర్ తెలంగాణ (తెలంగాణ న్యాయ వేదిక) ఆదివారం జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో తెలకపల్లి మండలం బొప్పల్లికి చెందిన కాసీం యాదవ్‌ను నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కాసీం యాదవ్ మాట్లాడుతూ తనకు బాధ్యతలు ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు దూస గౌరీశంకర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

రాత్రివేళ అరెస్టు అప్రజాస్వామికం

- టీపీఎఫ్ రాష్ట్ర కో కన్వీనర్ ప్రభాకర్


మాట్లాడుతున్న టీపీఎఫ్ రాష్ట్ర కో కన్వీనర్ ప్రభాకర్

గద్వాల టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):వరంగల్ ధర్నాకు వెళ్తారన్న సాకుతో పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సుభాన్, చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతిలను రాత్రివేళ పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టీపీఎఫ్) రాష్ట్ర కోకన్వీనర్ ప్రభాకర్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న మహిళా నాయకురాలిని రాత్రిపూట స్టేషన్‌లో నిర్బంధించడం ద్వారా పోలీసులు నిబంధనల ఉల్లంఘనకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని టీజేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ప్రజాసంఘాల నాయకులు అరెస్టులను తీవ్రంగా ఖండించారు. దండకారణ్యంలో ఆదివాసీలపై ఆపరేషన్ కగార్ పేరుతో సాగుతున్న ఊచకోతకు వ్యతిరేకంగా వరంగల్‌లో తలపెట్టిన ధర్నాకు అనుమతి ఇవ్వకపోవడం ప్రజా స్వామిక స్ఫూర్తికి విరుద్ధమన్నారు. సమావేశంలో బీఆర్ఎస్వీ జిల్లా కో ఆరినేటర్ కురువ పల్లయ్య, టీజేఎస్ జిల్లా కన్వీనర్ తదితరులు ఉన్నారు.

జెన్‌కో ఉద్యోగులకు క్రీడా పోటీలు

ఆత్మకూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్టుల్లో చెస్, క్యారమ్స్ పోటీలను నిర్వహించనున్నట్లు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఈ క్రీడా పోటీలను తెలంగాణ జెన్‌కో జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల డైరెక్టర్ కుమార్ రాజు హాజరై పోటీలను ప్రారంభించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని ఏడు ప్రాజెక్టులలో 2025-26 సంవత్సరాలకు గాను ఈ క్రీడా పోటీలను 24, 25, 26వ తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్రీడా పోటీల్లో జెన్‌కో ప్రాజెక్టుల్లో విధులు నిర్వహించే అధికారులు పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రతీ ప్రాజెక్టు నుంచి ఆరుగురిని ఎంపిక చేసి 26వ తేదీన ప్రతిభ కనబరిచి ఉద్యోగులకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సివిల్ ఎస్ఈ సురేష్ కుమార్, వనపర్తి జిల్లా కోర్సు కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌లు, డిప్యూటీ ఇంజినీర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మైసమ్మ పూజలు


నాయినోనిపల్లి మైసమ్మ దేవతకు నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో వెలిసిన మైసమ్మ దేవతకు ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి జిల్లాల నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల నుంచి ఆదివారం హుండీ ద్వారా రూ. 68,138, టికెట్ల ద్వారా రూ.72,065, మొత్తం రూ.1,40, 203 ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

మిషన్ పనిచేయదు.. యూరియా ఇవ్వరు

- రైతులకు తప్పని ఎదురు చూపులు

ఉప్పునుంతల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు సాగు చేసిన పత్తి, వరి, మొక్కజొన్న తదితర పంటలకు పైపాటుగా యూరియా ఎరువులు వేసుకొనేందుకు రైతులు ఫర్టిలైజర్ షాపుల వద్దకు వెళ్లిన రైతులకు నిరాశే మిగులుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని పీఏసీఎస్‌లో ఎరువుల దుకాణం, ఆగ్రో సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం యూరియాను సరఫరా చేస్తున్నది. కానీ, శనివారం నుంచి తంబు (బొటనవేలు) మిషన్ పనిచేయకపోవడంతో రెండు రోజులుగా యూరియా పంపిణీ నిలిపివేశారు. దీంతో దిక్కుతోచని స్థితిలో రైతులు యూరియా ఎప్పుడు పంపిణీ చేస్తారోనని పంపిణీ కేంద్రాల వైపు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో ఒక పాసు బుక్కు ఉన్న రైతుకు ఒక యూరియా బస్తా మాత్రమే ఇస్తున్నారు. ఒక్కో రైతు ఎకరం నుంచి దాదాపు 10 ఎకరాల వరకు సాగు చేస్తున్న ఒక్కో రైతుకు ఒకే బస్తా ఇవ్వడంతో సాగు ఎలా చేస్తామని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇది ఇలా ఉంటే చాలా మంది రైతుల వేలి ముద్ర స్కాన్ కాకపోవడం ఇబ్బందిగా మారుతోంది. కొంత మంది రైతులకు ఫోన్ సౌకర్యం లేక పోవడం, మరికొంత మందికి ఓటీపీ చెప్పే పరిజ్ఞానం లేకపోవడం, అదే విధంగా మరికొంత మంది రైతులకు ఆధార్‌కార్డుకు మొబైల్ లింకు లేక ఓటీపీ చెప్పలేకపోవడంతో యూరియా బస్తాలు తీసులేకపోతున్నామని పలు గ్రామాల రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రైతులకు ఇబ్బంది లేకుండా పట్టాదారు పాసుబుక్కు, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకొని యూరియా పంపిణీ చేసే విధంగా అధికారులు చూడాలని పలువురు రైతులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

చోరీకి గురైన సొత్తు స్వాధీనం

- వరుస దొంగతనాలకు పాల్పడిన దొంగ అరెస్టు, రిమాండ్



బిజినేపల్లి పోలీస్‌స్టేషన్‌లో నిందితుడితో పాటు స్వాధీనం చేసుకున్న సొత్తుతో సీఐ అశోక్ రెడ్డి, ఎస్ఐ కె.శ్రీనివాస్

బిజినేపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఏడాదికాలంగా రాత్రి సమయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడు బత్తుల మల్లేష్ అనే వ్యక్తి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అశోక్ రెడ్డి తెలిపారు. బిజినేపల్లి పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ కె.శ్రీనివాస్‌తో కలిసి ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించి విచారణలో వెల్లడైన వివరాలను తెలిపారు. మండలంలోని పాలెం గ్రామానికి చెందిన నిందితుడు బత్తుల మల్లేష్ పెయింటర్‌గా పనిచేస్తూ చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. జూలై నెలలో పాలెం గ్రామానికి చెందిన భారతి ఇంట్లో దొంగతనం చేసి పక్కనే ఉన్న వెంకటయ్య అనే వ్యక్తి సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లాడు. వెంకటయ్య ఫిర్యాదు మేరకు ప్రత్యేక బృందంతో విచారణ చేపట్టగా నిందితుడు పట్టుబడగా విచారణలో వరుసగా ఐదు దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నాడు. చోరీ చేసిన ఏడు తులాల బంగారం, 70 తులాల వెండి, సెల్‌ఫోన్ స్వాధీనపర్చుకున్నట్లు వెల్లడించారు. నిందితుడిని పట్టుకోవడంలో ఎస్ఐ కె.శ్రీనివాస్‌తో పాటు పోలీసు బృందం ప్రత్యేక శ్రద్ధ చూపడంపై అభినందించారు. ఎవరైనా ఇళ్లకు తాళాలు వేసి శుభకార్యాలకు, తీర్థయాత్రలకు వేరే ఊర్లకు వెళ్లే ముందు పోలీసులకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. ఆ ప్రాంతంలో పోలీసు పహారా పెట్టేందుకు వీలు ఉంటుందన్నారు. అలాగే ఇంటికి తాళాలు వేసి ఇంట్లో విలువైన వస్తువులు, నగదు ఉంచుకోవద్దని హెచ్చరించారు. ఆయా గ్రామాల్లోని వీధుల్లో కాలనీవాసులంతా కలిసి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలు జరగకుండా జాగ్రత్తపడవచ్చని సూచించారు. సమావేశంలో పోలీసు సిబ్బంది నరసింహ, ప్రవీణ్, అంజనేయులు, శివకుమార్, సురేందర్ తదితరులు ఉన్నారు.

భారీ కొండ చిలువల పట్టివేత



భారీ కొండ చిలువతో ఫారెస్టు ఆఫీసర్, సాగర్ స్నేక్ సొసైటీ సభ్యులు

పెద్దమందడి, గోపాల్‌పేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు ప్రాంతాల్లో రెండు కొండచిలువలు పట్టుబడ్డాయి. పెద్దమందడి మండల పరిధిలోని దొడగుంటపల్లి గ్రామంలో రేణు సోలార్ ప్లాంట్ ప్రదేశంలో శనివారం రాత్రి భారీ కొండ చిలువ ఉండటంతో ఫారెస్టు ఆఫీసర్ మంజులకు సమాచారం ఇవ్వగా సాగర్ స్నేక్స్ సొసైటీ సభ్యుడు కృష్ణసాగర్‌కు సమాచారం ఇచ్చారు. సాగర్ స్నేక్ సొసైటీ సభ్యులు అతి కష్టంమీద చాకచక్యంగా భారీ కొండ చిలువను పట్టుకున్నారు. బంధించి కొండ చిలువను ఆదివారం ఉదయం గణపురం మంజుల సమక్షంలో బలిజపల్లి, జంగమాయపల్లి గ్రామ సమీపంలోని అడవి ప్రాంతంలో వదిలి వేశారు. కొండ చిలువ 14 అడుగులు 23 కేజీల బరువు ఉంటుందని తెలిపారు. సొసైటీ సభ్యులు చిలుక కుమార్, అవినాష్, ఫారెస్టు అధికారులు వంశీ ఉన్నారు.

● వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం ఒక కొండ చిలువ పట్టుకున్నట్లు కృష్ణసాగర్ తెలిపారు. మండల కేంద్రం పరిధిలో ఉన్న చెన్నూర్ వాగు సమీపంలో స్థానికంగా ఉండే రైతు వల్లూరు చేపకోసం విసిరిన వలలో కొండచిలువ చిక్కిందని, దీంతో రైతు వల్లూరు కృష్ణసాగర్ సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరు కొని ఆ వలను కత్తిరించి ఆరు అడుగుల కొండ చిలువను పట్టుకున్నామని తెలిపారు.

జీఎస్టీ పేరుతో ఘరానా మోసం

- కొత్త పంథా ఎంచుకున్న కేటుగాళ్లు

కల్వకుర్తి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ధనార్జనే లక్ష్యంగా మోసగాళ్లు కొత్త మోసాలకు తెరలేపుతున్నారు. అభం శుభం తెలియని ఓ వ్యక్తి పేరు మీద జీఎస్టీలో సలీం ఎంటర్‌ప్రైజెస్ రిజిస్ట్రేషన్ చేసుకుని సుమారు 100కోట్ల విలువైన నకిలీ ఇన్వాయిస్‌లను జారీ చేసిన విషయం కలకలం రేపుతున్నది. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణానికి చెందిన మహమ్మద్ సలీంపాష ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో 15వేల జీతానికి పని చేస్తున్నాడు. అతని పేరు మీద సైబర్ మోసగాళ్లు సలీం ఎంటర్‌ప్రైజెస్ పేరుతో నకిలీ ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దాదాపు వంద కోట్ల వరకు నకిలీ ఇన్వాయిస్‌లు చూపించారు. వాటి ఆధారంగా ఓ బ్యాంకు నుంచి సుమారు 10కోట్ల వరకు రుణం తీసుకున్నారు. చివరకు ఆ ఖాతాలో ఎలాంటి లావాదేవీలు జరగకపోవడంతో జీఎస్టీ అధికారులు అనుమానం వచ్చి సలీంపాష ఇంటిని పరిశీలించారు. జీఎస్టీ అధికారులు సలీం పాషను విచారించగా అతనికి ఎలాంటి సంబంధం లేదని ధ్రువీకరించుకుని పంచనామా సేకరించారు.

సలీంపాషకు సీఏతోపాటు ఓ న్యాయవాది న్యాయ సలహా ఇచ్చినట్లు సమాచారం. సైబర్ నేరగాళ్లు సలీం పాష పేరు మీద నకిలీ ధ్రువపత్రాలతో సలీం ఎంటర్‌ప్రైజెస్ సంస్థను స్థాపించి మోసానికి పాల్పడ్డ విషయంపై తనకు ఎలాంటి సమాచారం లేదని బాధితుడు పేర్కొన్నారు.

జీఎస్టీ అధికారులు సైతం సైబర్ నేరస్తులు నకిలీ ఖాతాలు తెరిచినట్లు నిర్ధారించుకున్నారు. కల్వ కుర్తి సీఐ నాగార్జునని వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

బైకును ఢీకొట్టిన లారీ యువకుడి మృతి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



రోడ్డుప్రమాదంలో మృతి చెందిన శ్రీను

కల్వకుర్తి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : బైకును లారీ ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి కథనం ప్రకారం... కల్వకుర్తి మండల పరిధిలోని తాండ్ర గ్రామానికి చెందిన లస్కర్ శ్రీను(37) కల్వకుర్తిలో వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బైకుపై కల్వకుర్తికి బయల్దేరాడు. సీబీఎం కళాశాల సమీపంలోని జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న లారీ ఓవర్‌టెక్ చేస్తూ బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైకుపై ప్రయాణిస్తున్న శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య స్వాతి, ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తాండ్ర గ్రామానికి చెందిన లస్కర్ శ్రీను రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి భార్య, పిల్లలను ఓదార్చి ఆర్థిక సహాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, ఎస్టీ, ఎస్సీ మానిటరింగ్ కమిటీ సభ్యులు జిల్లెల రాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ పసుల రమాకాంత్‌రెడ్డి,

పాఠశాలల్లో క్రీడా పండుగ

» **ప్రారంభమైన మండల, జిల్లా స్థాయి జట్ల ఎంపికలు**



స్టేడియంలో అండర్-15 వాలీబాల్ ఎంపికలు నిర్వహిస్తున్న దృశ్యం(ఫైల్)

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీల నిర్వ హణకు ముందడుగు పడింది. 2025-26 సంవత్సరానికి సంబంధించి పోటీలను నిర్వహించే తేదీలను ఇప్పటికే రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ నుంచి జిల్లాలకు ఆదేశాలు జారీ చేసింది. డీఈవోల ఆధ్వర్యంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులతో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించి పోటీల తేదీలు ఖరారు చేశారు. ఈ ఏడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల నిర్వహణకు సమాయాత్తమయ్యారు.

మండల, జిల్లా స్థాయి పోటీలు, ఎంపికలు ప్రారంభ మయ్యాయి. పాఠశాల, కళాశాల స్థాయిలో అండర్-14, 17, 19 విభాగాల్లో బాల, బాలికలకు వేర్వేరుగా మండల, జిల్లా స్థాయి అనంతరం ఉమ్మడి జిల్లా జట్లను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపిస్తారు. మండల స్థాయి ఎస్‌జీ ఎఫ్ పోటీల తేదీలు ఖరారు కావడంతో క్రీడాకారుల్లో ఉత్సాహం నెలకొంది.

20 అంశాల్లో క్రీడా పోటీలు...

మొదటగా నెల చివరి వరకు మండలస్థాయి వరకు ఖోఖో, కబడ్డీ, ఖోఖో క్రీడా అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. తరువాత బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, క్రికెట్, సాఫ్ట్‌బాల్, యోగా, ఆర్చరీ, బాక్సింగ్, నెట్‌బాల్, రగ్బీ, చెస్, తైక్వాండో, కరాటే, జూడో క్రీడా అంశాల్లో జిల్లా, సెప్టెంబర్ రెండో వారంలో ఉమ్మడి స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. ఆయా క్రీడా అంశాల్లో ప్రతిభ కనబరిచిన క్రీడా కారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. కళాశాల స్థాయిలో ఎస్‌జీఎఫ్ అండర్-19 ఉమ్మడి జిల్లా క్రీడా ఎంపికలు సెప్టెంబర్‌లో ప్రా రంభిస్తారు.

గతే ఏడాది జాతీయ స్థాయి పోటీలకు

100 మంది క్రీడాకారులు..

2024-25 విద్యా సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో రెండు జాతీయ, పది రాష్ట్రస్థాయి టోర్నీలు నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక జాతీయ, మూడు రాష్ట్ర స్థాయి టోర్నీలు, నారాయణపేటలో ఒక జాతీయ జాతీ యస్థాయి టోర్నీ నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో వనపర్తి-2, జోగుళాంబ గద్వాల-3, నాగర్‌కర్నూల్-1 టోర్నీ నిర్వహించారు.

సుమారు 100 మందికిపైగా బాల, బాలికలు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. వారికి భవిష్యత్తులో ఉన్నత విద్య, ఉద్యోగాల్లో క్రీడా కోటా దక్కనుంది.

పకడ్బందీగా నిర్వహిస్తాం



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీల నిర్వహణ పారదర్శకంగా నిర్వహిస్తాం. మండల స్థాయిలో ఖోఖో, కబడ్డీ, ఖోఖో, మిగతా క్రీడా అంశాల్లో నేరుగా జిల్లా స్థాయి, ఉమ్మడి జిల్లా స్థాయిలో ఎంపికలు ఉంటాయి. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులనే రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తాం. అండర్-15 జిల్లా స్థాయి వాలీబాల్ ఎంపికలు నిర్వహించాం.

- డాక్టర్ శారదాబాయి, అండర్-17 ఎస్‌జీఎఫ్ సెక్రటరీ, మహబూబ్‌నగర్

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం

» **పెట టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్**

» **వాలీబాల్ చాంపియన్ చిన్నరేవల్లి**

» **రన్నర్‌గా నిలిచిన మరికల్**



విజేతగా నిలిచిన చిన్నరేవల్లి జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం (పెట) తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పీడీ వేణుగోపాల్ అన్నారు. ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని స్టేడి యం మైదానంలో 17వ గ్రామోత్సవ గ్రామీణ జిల్లా స్థాయి పురుషుల వాలీబాల్ ప్రీమియర్ లీగ్ ముగింపు కార్యక్రమానికి పీడీ వేణుగోపాల్, వాలీబాల్ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నవీరయ్య హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు ప్రతీ ఏడాది నిర్వహించడం అభినందనీయం అన్నారు. గ్రామీణ క్రీడాకారులు ప్రతిభ చాటి జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాక్షించారు. విజేతగా చిన్నరేవల్లి, రన్నర్‌గా మరికల్ జట్లు నిలిచాయి. మూడో స్థానంలో నవాబ్‌పేట, నాలుగో స్థానంలో పోలేపల్లి జట్లు నిలిచాయి. విజేతకు రూ.10వేలు, రన్నర్ జట్టుకు 7వేలు, మూడో స్థానం జట్టుకు 5వేలు, 4వ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 3వేల నగదు ట్రోఫీ అందజేశారు. విజేత, రన్నర్ జట్లు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయి. పీడీలు రమేష్‌బాబు, రాంచందర్, నిరంజన్‌రావు, వడెన్న, ఇషా వలంటీర్లు రమేష్, గిరిధర్ పాల్గొన్నారు.

నేషనల్ కరాటే టోర్నీలో విద్యార్థుల ప్రతిభ



నేషనల్ కరాటే టోర్నీలో పతకాలు సాధించిన కింగ్ షోటోకాన్ విద్యార్థులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో ఆదివారం జరిగిన జాతీయ స్థాయి కరాటే చాంపియన్ షిప్‌లో జిల్లా కేంద్రానికి చెందిన కింగ్ షోటోకాన్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ఫౌండర్, కరాటే మాస్టర్ జహంగీర్‌పాషాఖాద్రీ తెలిపారు. టోర్నీలో హుమేర, హఫ్స, అయేషా, గుల్‌షిఫా, తనీష్, అమాన్, సూఫియన్, సాబేర్‌పాషా, బిలాల్, జుల్ఫికర్, ఫైజన్, హంజేఫ్ బంగారు పతకాలు, నిఖిల్, నబీల్ రజత, ఖాసిం, అహ్మద్ కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులకు నిహన్ షోటోకాన్ చీఫ్ ఫౌండర్ రవీందర్‌కుమార్ పతకాలు అందించారు.

యోగాలో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించాలి

- జిల్లా యోగా సంఘం అధ్యక్షుడు రాములు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి యోగా టోర్నీలో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించాలని జిల్లా యోగా సంఘం అధ్యక్షుడు రాములు అన్నారు. రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా అండర్-18 నుంచి 45 వయస్సుల విభాగాల్లో ఎంపికలను ఆదివారం నగరంలోని ఇండోర్‌స్టేడియం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు రాములు హాజరై ఎంపికలను ప్రారంభించారు. జిల్లా ఒలంపిక్ సంఘం ప్రధాన కార్యద ర్శి కురుమూర్తిగౌడ్, జిల్లా యోగా ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, పీడీ రజిని, సీనియర్ క్రీడాకారులు మణికంఠ, సాగర్, బాలమణి పాల్గొన్నారు.

జట్టు వివరాలు....

మహిళ విభాగంలో: నందిని, కావేరి, అంకిత, పూజిత, శైలజా, స్వప్న, శ్వేత, బాలమణి

పురుషుల విభాగంలో: సాగర్, మధు, అకాష్

చెంచుల మధ్య ఘర్షణ

» **పోలీసులకు పరస్పర ఫిర్యాదులు**

» **డీఎస్పీ ఆధ్వర్యంలో ఇరువర్గాలతో సంప్రదింపులు**



సార్లపల్లి గ్రామంలో విచారణ జరిపి కొంతమంది చెంచులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

అమ్రాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల పరిధిలోని వివిధ చెంచుపెంటలు- గ్రామాల్లో నివసిస్తున్న చెంచు గిరిజన ప్రజల మధ్యన వివాదం ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో నల్లమల ప్రాంతంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ వివాదానికి రెండు వర్గాలకు చెంది న వారు వాట్సాప్ గ్రూపులలో మెసేజ్‌లు ఫార్వర్డ్ చేయడం ద్వారా ఒకరిపై ఒకరు ప్రత్యక్షంగా దాడులు చేసుకునే వరకు వెళ్లిందని చెప్పవచ్చు. మండల పరిధిలోని సార్లపల్లి మాజీ సర్పంచ్ చిగుర్ల మల్లికార్జున్‌పై శనివారం మన్ననూర్‌లో మరొక వర్గానికి చెందిన కొంతమంది దాడి చేశారని అనంతరం అమ్రాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయటానికి వెళ్లిన సమయంలో కూడా ఘర్షణ నెలకొన్నట్లు తెలిసింది. జోక్యం చేసుకున్న పోలీసులు శనివారం రాత్రి సర్పంచ్ మల్లికార్జున్‌ను అదుపులోకి తీసుకొని ఆదివారం ఉదయం పెద్ద ఎత్తున వెళ్లిన పోలీసులు సార్లపల్లి గ్రామానికి చెందిన మరి కొంత మంది చెంచులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఇరువర్గాలకు చెందిన వారిని అచ్చంపేట డీఎస్పీ కార్యాలయానికి తీసుకువెళ్లి విచారించారు. ఈ ప్రాంతంలోని వివిధ సంఘాలకు చెందిన బాధ్యులు కొంతమంది అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు వద్దకు వెళ్లి కేసులు నమోదు చేయకుండా ఇరు వర్గాలకు చెందిన వారితో మాట్లాడి సామరస్యత నెలకొనే విధంగా ప్రయత్నించినట్లు తెలిసింది. మూడు రోజుల తర్వాత రెండు వర్గాలకు చెందిన వారు మాట్లాడుకుని రావాలని పోలీసులు చెప్పి పంపినట్లు సమాచారం. ఈ విషయంపై అమ్రాబాద్ సీఐ శంకర్ నాయక్‌ను వివారణ కోరగా ఇరు వర్గాల వారు గొడవపడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, ఈ సంఘటనకు సంబంధించి దర్యాప్తు జరుగుతున్నదని వెల్లడించారు.

మెకానిక్ ఆత్మహత్య



అంజనేయులు (ఫైల్)

అలంపూర్ ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అలంపూర్ పట్టణ కేంద్రంలో ఓ సైకిల్ మెకానిక్ ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అక్బర్ పేట కాలనీకి చెందిన అంజనేయులు (36) గతేడాది కాలం నుంచి డయాలసిస్‌తో బాధపడుతున్నాడు. ఆరోగ్యం మెరుగు పడక పోవడంతో జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి అందాజ 11 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతని భార్య నాలుగు నెలల క్రితమే తన పుట్టింటికి వెళ్లిపోయిందని, తండ్రి మునెప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు.

యువతి అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రానికి చెందిన యువతి పీట్ల నాగలక్ష్మి(20) అదృశ్యమైనట్లు ఎస్ఐ గోవర్ధన్ ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన నాగలక్ష్మి అంగన్‌వాడీ కేంద్రంలో ఒక నెల రోజుల క్రితం నుంచి ఆయాగా పని చేస్తుంది. ఈ నెల 20వ తేదీన షాపునకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోయేసరికి బంధువులు, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి మాసమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

వరకట్న వేధింపులతో మహిళ ఆత్మహత్య

కోయిలకొండ, ఆగస్టు 24 (ఆంధ్ర జ్యోతి): పెళ్లి చేసుకొని ఏడాది కాకుం దానే తల్లిదండ్రుల నుంచి అదనపు కట్నంతో పాటు బంగారం ఇప్పించాలని భార్యను భర్తతో పాటు అత్తవారింటి వారు వేధింపులకు గురి చేయడంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. ఉరి వేసుకొని వెంకటేశ్వరి (సంధ్య) ఆత్మహత్య చేసుకొన్న సంఘటన కోయిలకొండ మండలం రాంపూర్ గ్రామంలో చోటు చేసుకొంది. ఎస్ఐ తిరుపాజీ ఆదివారం ఇందుకు గల వివరాలను వెల్లడించారు. కో యిలకొండ మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన గంజి రాజుకు హన్వాడ మండలం కొత్తపేట గ్రామానికి చెందిన వెంక టేశ్వరితో 2024 అక్టోబర్ 17న రాంపూర్‌లో వివాహం జరిగింది. రాజుకు వరకట్నం కింద రూ 2లక్షలు, 4 తులాల బంగారం అం దించారు. కొన్ని రోజులు అయిన తరువాత భర్త రాజు అవసరం కోసం పెళ్లిలో పెట్టిన బంగారం తకట్టు పెట్టి డబ్బులు తీసుకు న్నాడు. ఆ తరువాత వెంకటేశ్వరి వారి తల్లి గారి నుంచి బంగారంతో పాటు డబ్బులు ఇవ్వాలని రాజు భార్యను వేధిస్తున్నాడు. ఈ నెల 3వ తేదీన వరకట్నం తీసుకురావాలని భార్యని తల్లిగారి ఇంటికి పంపించాడు. పంచాయతీ పెట్టి సర్ది చెప్పి భార్య వెంకటేశ్వరిని అత్తవారి ఇంటికి పంపించారు. మళ్లీ భర్త రాజు, అత్తంటివారు వరకట్నం కోసం వేధింపులకు గురి చేయడంతో వెంకటేశ్వరి శనివారం అత్తవారింటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. బాధితురాలి తల్లి అంజమ్మ ఫిర్యాదు మేరకు భర్త గంజి రాజు, అత్త, మామలు గంజి రాములు, దేవమ్మ, మరిది నాని, ఆడకూతురు జ్యోతి, మేనమామ పారుపల్లి శ్రీహరిపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

» **రూ 5600 నగదు, రెండు మొబైల్ ఫోన్లు, 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం**

గట్టు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): చాగదోణ గ్రామ శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై గట్టు ఎస్ఐ కేటీ మల్లేష్ ఆధ్వర్యంలో ఆదివారం తన సిబ్బందితో దాడి చేసి నగదుతో పాటు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని పేకాట రాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చాగదోణ గ్రామ శివారులో గల గూలగట్టు దగ్గర పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో వెంటనే ఎస్ఐ తన సిబ్బందితో దాడి చేశారు. దాడిలో ఐదు ద్విచక్ర వహనాలు, రూ.5,600 నగదు, రెండు మొబైల్ ఫోన్స్ సీజ్ చేసినట్లు తెలిపారు. పరారీలో ఉన్న వారిని పట్టుకుని దర్యాప్తు జరుపుతామని ఎస్ఐ తెలిపారు. ఈ దాడిలో కానిస్టేబుళ్లు స్వామి రాజు, బుడ్డన్న, రామాంజి, ప్రకాష్, భరత్‌కుమార్‌లు పాల్గొన్నారని ఎస్ఐ తెలిపారు.

నేను సైతం ఆధ్వర్యంలో

పూజా సామగ్రి పంపిణీ



పూజా సామగ్రిని పంపిణీ చేస్తున్న దిడ్డి ప్రవీణ్ కుమార్

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితిని పురస్కరించుకుని ఈ నెల 27న ఉమ్మడి జిల్లాలోని 711 దేవాలయాలకు, వినాయక మండపాలకు ఆదివారం జిల్లా కేంద్రంలోని నేనుసైతం కార్యాలయంలో పూజా సామగ్రిని, డ్రెస్‌కోడ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నేనుసైతం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు దిడ్డి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పురాతన దేవాలయాల్లో ప్రతిరోజు నిత్యపూజకు అవసరమయ్యే 22 రకాల సామగ్రిని స్వచ్ఛందంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ మొత్తం రూ.7లక్షల దాకా ఉంటుందని తెలిపారు. మహబూబ్‌నగర్, నారాయ ణపేట, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాలతో పాటు, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో పలు దేవాలయాలకు సామగ్రిని పంపిణీ చేసినట్లు ఆయన తెలిపా రు. తెలంగాణ రాష్ట్రంతో పాటు ఏపీ, కర్ణాటక రాష్ట్రాలలో ఈ ఉచిత పూజా సామగ్రిని పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పూజా సామగ్రితో పాటు దేవాలయానికి వచ్చే భక్తులకు విధిగా సాంప్రదాయ వస్త్రధారణతో రావాలని సూచించే ఫ్లెక్సీలను సైతం పంపిణీ చేసినట్లు తెలిపారు. స్వచ్ఛంద సంస్థ సభ్యులు కొంగర పవన్ కుమార్, రెయిన్‌బో శ్రీనివాస్, తిరుమల సత్యనారాయణ, ప్రియ, సత్యం, దస్తయ్య, కొందూరు శ్రీహరి, గణేష్ రావు పాల్గొన్నారు.

సీఎం పీఏకు మంత్రుల పరామర్శ



ముఖ్యమంత్రి పీఏ జయపాల్‌రెడ్డి తండ్రి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

అచ్చంపేట/ ఉప్పునుంతల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వ్యక్తిగత సహాయకుడు వెల్దండ జయపాల్‌రెడ్డిని పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పరామర్శించారు. రెండు రోజుల క్రితం జయపాల్‌రెడ్డి తండ్రి వెల్దండ రాంచంద్రారెడ్డి అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆ విషయం తెలుసుకున్న రాష్ట్ర మంత్రులు సీతక్క, వాకిటి శ్రీహరిలు ఆదివారం ఉప్పునుంతల మండలం తిర్మలాపురం గ్రామాన్ని సందర్శించి జయపాల్‌రెడ్డి తండ్రికి నివాళులర్పించారు. జయపాల్‌రెడ్డిని పరామర్శించిన వారిలో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, జుక్కల్ శాసనసభ్యుడి లక్ష్మీకాంతరావు, స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ శివాసేనారెడ్డి తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అచ్చంపేట రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం సిద్దాపూర్ గ్రామంలో ఆదివారం పాల్వాయి హరీష్(24) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. హరీష్‌పై 5నెలల క్రితం పోక్సో కేసు నమోదైంది. కేసుతో సదరు బాలిక తల్లిదండ్రులు, బంధువుల వేధింపులు తాళలేక మార్చి 8న పురుగు మందు తాగాడు. హరీష్ తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. యువకుని తండ్రి రామకృష్ణ మాత్రం తన కుమారుడు ఓ బాలికను ప్రేమించేవాడని, కేసు పెట్టించడమే కాకుండా తండ్రి, బంధువులు కొట్టారని, కొడుకు ఆత్మహత్యాయత్నానికి ఇదే కారణమని ఆరోపిస్తూ సిద్దాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

తండ్రి ఫిర్యాదు మే రకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిద్దాపూర్ ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.



న్యూస్ బాక్స్

ఆయకట్టుకు నీటి విడుదల

దేవరకద్ర, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : కోయిల్‌సాగర్ ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరడంతో జలకళను సంతరించుకుంది. కోయిల్ సాగర్ ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 32.5 అడగులు కాగా, ఆదివారం సాయంత్రం నాటికి 32.2 అడుగులకు చేరింది. ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాల్వ ద్వారా రైతులు సాగు చేసుకున్న పంటలకు నీటి విడుదల కొనసాగుతోందని, నీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు.

కొనసాగుతున్న అఖండ దీపారాధన

దేవరకద్ర, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్య ఆలయంలో అఖండ దీపారాధన, భజన కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు ప్రతీ రోజు స్వామి వారికి ప్రత్యేక పూజలతో అభిషేకాలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం భజనలు చేస్తున్నారు.

ఘనంగా రంగనాయక స్వామి రథోత్సవం

దేవరకద్ర, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వెలసిన రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. స్వామి వారికి పూజలు, అభిషేకాలు, అలంకరణ చేపట్టారు. అనంతరం రాత్రి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, రథోత్సవంపై ఉంచి ఆలయం చుట్టూ ఊరేగించారు.

తోటి మిత్రుల ఆర్థిక సాయం

మూసాపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండలం సుంకురామయ్యపల్లిలో ఇటీవల విద్యుదాఘాతానికి గురై ప్రమాదవశాత్తు గాయపడిన డ్రైవర్‌కు కోటేష్‌కు ఆదివారం తోటి డ్రైవర్ యూనియన్ తరఫున పరామర్శించి రూ.18 వేలు ఆర్థిక సాయం అందజేశారు. డ్రైవర్ యూనియన్ సభ్యులు గట్టు ఆంజనేయులు, నాగేందర్‌యాదవ్, అహ్మద్, మనోహర్, బాలరాజు, కురుమూర్తి, రామాంజనేయులు, హుస్సేన్ ఉన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

మూసాపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంకలమద్ది కాంగ్రెస్ గ్రామ కాంగ్రెస్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా సురేందర్ (సిద్ధు)తో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్, బగ్గి కృష్ణయ్య, నాగిరెడ్డి, నారాయణ, అంజనేయులు, చంద్రశేఖర్, గౌతంమహావీర్, ఖలీల్, శివకుమార్ ఉన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డికి నివాళి

పాలమూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు రెడ్డి సేవా సమితి ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో సురవరం సుధాకర్‌రెడ్డి చిత్ర పటానికి నివాళి అర్పించారు. అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, రాజేందర్‌రెడ్డి, నరసింహారెడ్డి, వెంకట్రామిరెడ్డి, సురేందర్ రెడ్డి, కోటేశ్వర రెడ్డి, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు వినాయక విగ్రహాల పంపిణీ

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఆర్యవైశ్యులకు మట్టి గణేష్ విగ్రహాలు పంపిణీ చేయనున్నట్లు ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు గుండా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి మిర్యాల వేణుగోపాల్, కోశాధికారి తల్లం నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రాహ్మణవాడిలోని వాసవీ ఫంక్షన్ హాల్ వద్ద ఉదయం 8.30 గంటల నుంచి పంపిణీ చేస్తామన్నారు.

చేయూతనిస్తే అద్భుతాలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు చేయూతనిస్తే అద్భుతాలు సృష్టిస్తారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహబూబ్‌నగర్ ఫస్ట్, వందేమాతం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజవర్గంలోని 28 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివే పదోతరగతి విద్యార్థులను మెరిట్ ఆధారంగా ఎంపికైన 263 మందిని ఎంపిక చేసి, రెండు రోజుల శతశాతం అనే కార్యక్రమంలో భాగంగా అనుభవజ్ఞులైన అధ్యాపకులచే ప్రేరణ తరగుతులు నిర్వహించారు. ఈ తరగతులను ఎమ్మెల్యే ఆదివారం పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు మొదటి రోజు నేర్చుకున్న విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, గుండా మనోహర్, అనిల్, రాజు, మల్లేష్ పాల్గొన్నారు.

వెంచర్ యజమానిపై చర్యలు తీసుకోవాలి

రాజాపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సమీపంలో ఉన్న సమీర్ ప్రమోటర్స్ రిసార్ట్స్ యజమాని, మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని ఆదివారం కేసు నమోదైనట్లు ఎస్ఐ శివానందం తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. బాలానగర్ మండలం గుండేడ్ గ్రామానికి చెందిన గోపన్‌గౌడ్ 2019లో రూ.2,70,000 సమీర్ ప్రమోటర్స్ రిసార్ట్స్ నందు ప్లాట్ నెంబరు 1784లో, 100 గజాల ప్లాట్‌ను కొనుగోలు చేశాడు. అట్టి ప్లాట్‌కు విడతల వారిగా రూపాయలు చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకొని రూ.1,50,000 చెల్లించారు. మిగతా డబ్బులు కట్టడానికి వెళ్తే.. సమీర్ ప్రమోటర్స్ రిసార్ట్స్ యజమాని సమీర్, మేనేజర్ గిరి చరణ్ ప్రస్తుతం ప్లాట్ విలువ రూ.6 లక్షలు అయ్యింది. మొత్తం కట్టి రిజిస్ట్రేషన్ చేసుకో, లేదా డబ్బులు తిరిగి తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇళ్ల మధ్యనే మురుగు

» పాత పాలమూరులో 25 ఏళ్ల క్రితం నిర్మించిన కాలువ

» పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



పాతూరులో ఇళ్ల మధ్యనే పారుతున్న మురుగు

పాలమూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఇళ్లలో నీరు నిల్వ ఉంచుకోరాదు.. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.. వర్షాకాలంలో రోగాల బారిన పడితే తక్షణమే వైద్యం చేయించుకోవాలని మునిసిపల్ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, శానిటరీ సిబ్బంది పదే పదే ప్రజలకు సూచిస్తుంటారు. కానీ నగరంలోని పాత పాలమూరు (11వ వార్డు)లో ఇళ్ల మధ్యనే మురుగుకాలువ సుమారు కిలో మీటరు వరకు ప్రవహిస్తోంది. దీంతో కాలనీవాసులు నిత్యం ఏదో ఒక రోగం బారిన పడుతున్నారు. 25 ఏళ్ల క్రితం కట్టిన డ్రైయినేజీ భూమిలో కలిసిపోయింది. దీంతో మురుగు ముందుకు సాగక డెంగీ, మలేరియా వ్యాధులు వ్యాపిస్తున్నాయని, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చొరవ తీసుకుని మరమ్మతు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలి..



పాత పాలమూరులో కిలో మీటరు మేర ఉన్న ఈ కాల్వను అండర్‌గ్రౌండ్ డ్రైనేజీగా నిర్మించాలి. కాలువ అడుగున స్లాబ్ వేసి నిర్మాణం చేస్తేనే బాగుంటుంది..

- పాతూరు రమేష్, కాలనీవాసి

ఎమ్మెల్యే చొరవ చూపాలి..



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటేనే కాల్వ నిర్మాణం సాధ్యమవుతోంది. అదే విధంగా మునిసిపల్ సిబ్బంది రెగ్యులర్‌గా పారిశుధ్య చర్యలు చేపట్టాలి.

- చెన్నయ్య, కాలనీవాసి

దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలి



సన్నాహాక సదస్సులో పాల్గొన్న దివ్యాంగులు

జడ్చర్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు రూ.6 వేలు, వితంతువులు, ఒంటరి మహిళలతో పాటు చేయూత పింఛన్ రూ.4 వేలకు పెంచాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి భిక్షపతి డిమాండ్ చేశారు. ఈనెల 26న జడ్చర్లలో నిర్వహించే దివ్యాంగులు, చేయూత పింఛన్‌దారుల సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ హాజరుకానున్నట్లు తెలిపారు. జడ్చర్ల మండలం పోలేపల్లిలో ఆదివారం నిర్వహించిన చేయూత పింఛన్‌దారుల సన్నాహక సదస్సులో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పింఛన్ పెంచి ఇవ్వాలన్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యాదయ్య, శివకుమార్, నరసింహ, నరేందర్, ఖైలారం శ్రీరామ్, కమలాకర్, గడ్డం యాదన్న పాల్గొన్నారు.

బంగారు మైసమ్మ బోనాలు

జడ్చర్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీ కావేరమ్మపేటలో బంగారు మైసమ్మ బోనాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో మేళతాళాల మధ్య, శివసత్తుల ప్రదర్శనలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు గోనెల నరేందర్, విజయ్, పర్వవేది పాల్గొన్నారు.

గెలుపే ధ్యేయంగా పనిచేద్దాం

హన్వాడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే ధ్యేయంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని బీజేపీ జిల్లా కోశాధికారి డాక్టర్ వెంకటయ్య అన్నారు. ఆదివారం యారోనిపల్లిలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొండ లింగన్న, నాయకులు రమణారెడ్డి, కృష్ణయ్యగౌడ్, వేణు, రఘురాంగౌడ్, జుక్యానాయక్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు పరామర్శ

చిన్నచింతకుంట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉంద్యాల గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న రాజశేఖర్‌రెడ్డిని ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. అదే విధంగా జంపన్నను పరామర్శించారు.

కరాటేతో స్వీయ రక్షణ

జడ్చర్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : కరాటేతో స్వీయ రక్షణతో పాటు క్రమశిక్షణ అలవడుతోందని జడ్చర్ల సీఐ కమలాకర్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం కరాటే బెల్ట్‌ల ప్రదానోత్సవంలో పాల్గొని, మాట్లాడారు. సెల్ఫ్ డిఫెన్స్ కోసం అమ్మాయిలు కరాటే నేర్చుకోవాలన్నారు. కరాటే విద్యార్థులకు కరాటే ఫెడరేషన్ ఆఫ్ షోటోఖాన్ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించి కరాటే బెల్ట్‌లు ప్రదానం చేశారు. యూనియన్ అధ్యక్షుడు గణేష్, ప్రధాన కార్యదర్శి తాజొద్దీన్, కిట్టు, ఖాజామైనొద్దీన్, లక్ష్మణ్, అబ్దుల్లా, వెంకటేశ్, షఫీ, మునీర్, సత్యం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థలోని అన్ని వార్డుల్లోని కాలనీల సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ లక్ష్యమని మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని వెంకటరమణ కాలనీలో నిర్మిస్తున్న మురుగు కాల్వతో పాటు ఎదిర శివారులోని తిరుమల కాలనీలో సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. నగర అభివృద్ధికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అధిక నిధులు వెచ్చించి కృషి చేస్తున్నారని తెలిపారు. వెంకటరమణ, ఎక్‌నాథ్‌రెడ్డి, గోపాల్, హనుమంతు, శివశంకర్, మల్లేష్, నాని పాల్గొన్నారు.

బీఆర్ఎస్ చిల్లర రాజకీయాలు మానుకోవాలి

మహబూబ్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : యూరియా పేరుతో బీఆర్ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్లు అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ కౌన్సిలర్లు ఖాజాపాషా, జాజిమొగ్గ నర్సింహులు మాట్లాడారు. యూరియా కేంద్రం వద్ద రిక్షావాల పడిపోతే మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ రైతుగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వంలో పాలమూరులో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. మీ హయాంలో యూరియా సమస్యలు రాలేదా? అని ప్రశ్నించారు. కేంద్రం పరిధిలో ఉన్న అంశాన్ని కూడా బీఆర్ఎస్ నాయకులు ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వంపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రామస్వామి, తిరుమల వెంకటేశ్, అంజద్‌అలీ, రాశెద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

మిడ్జిల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమం కోసం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు అశోక్, జహీర్, నర్సింహులు గుప్తా, పర్వతాలు, ఉస్మాన్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన దోమ అంజిరెడ్డి తల్లి యాదమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.18,500 చెక్కును ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఆదాం, బాలస్వామి, నరేందర్‌రెడ్డి, లింగం పాల్గొన్నారు.

ఆలయాల కమిటీ ఎన్నిక

నవాబ్‌పేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యన్మనగండ్ల గ్రామ ఆలయాల కమిటీ అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన శేఖర్ రెడ్డి ఎన్నికైనట్లు కమిటీ గౌరవ సలహాదారులు లక్ష్మయ్య, రఘువీర్ ఆదివారం తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా రంజీత్‌గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా జనార్దన్, బాలయ్య, ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య, ఉపాధ్యక్షులుగా భాస్కర్, సత్యనారాయణగౌడ్, కోశాధికారిగా శివదర్శనంగౌడ్, సలహాదారులు చెన్నయ్య, ఆశన్న, ఆర్గనైజర్‌గా శేఖర్, ప్రచార కమిటీ సభ్యులుగా వెంకటయ్య, గోపాల్, శేఖర్ ఎన్నికయ్యారు.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక

రాజాపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ మండల కమిటీని ఆదివారం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా గంగాధర్ గౌడ్, రాజు, మధు, ఉపాధ్యక్షులుగా శేఖర్ గౌడ్, మాధవరెడ్డి, ప్రవీణ్‌గౌడ్, శిరీష, కార్యదర్శులుగా నర్సింహులు, పోలెమోని మధు, శ్రీనివాసులు, మహేష్‌నాయక్, కోశాధికారిగా బాలాగౌడ్, కార్యవర్గ సభ్యులుగా ఉదయ్‌గౌడ్, జంగయ్య, రాజు, జగదీష్, హన్మంత్‌నాయక్, నాగరాజు ఎన్నికయ్యారు. జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, రాజేష్, జనార్దన్‌రెడ్డి, అశోక్‌గుప్తా, ఆనంద్, నర్సింములు, పల్లె శేఖర్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణ భగవానుడి ఊరేగింపు



శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

జడ్చర్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల పట్టణంలోని వెంకటేశ్వరకాలనీ, సరస్వతీ కాలనీల్లో ఆదివారం కృష్ణభగవానుడి ఊరేగింపును త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక మహబూబ్‌నగర్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు నాగ్యానాయక్ తెలిపారు. భక్తులు శ్రీనివాసులు, విజయభాస్కర్‌రెడ్డి, రవి, తిరుపతయ్య, వెంకటేశ్, సత్యం, వెంకట్‌రాములు, భాస్కర్, తిరుమలేష్, మల్లేష్, బుచ్చిలింగం, చింటు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పారిశుధ్యం అధ్వానం

» పారిశుధ్య కార్మికులకు అందని వేతనం



షాషాబ్‌గుట్ట ప్రభుత్వ పాఠశాలలో పేరుకుపోయిన చెత్త



జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాలలో వంట ఏజెన్సీ సభ్యులు పాఠశాల ఆవరణను శుభ్రం చేస్తున్న దృశ్యం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల పరిసరాలు అపరిశుభ్రతకు ఆనవాళ్లుగా మారాయి. ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు కార్మికులను నియమించినా... పరిశుభ్రత పాటించాలని ఆశించినా ఫలితం కానరావడం లేదు. వారికి వేతనాలు చెల్లించకపోవడంతో పని చేయడం లేదు. ఉన్నతాధికారులు దృష్టి సారించి వారికి రావల్సిన బకాయిలు విడుదల చేస్తేనే సమస్యలు తీరే అవకాశం ఉంది.

ప్రారంభంలో బాగున్నా..

సర్కారు బడుల్లో తరగతి గదులు, టాయిలెట్స్, పాఠశాల ఆవరణను శుభ్రపరిచేందుకు కార్మికులను నియమించుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో హెచ్ఎంలు, ఎస్ఎంసీ చైర్మన్లు, అమ్మఆదర్శ కమిటీల అధ్యక్షులు, సభ్యుల ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులను నియమించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి ఒక్కో పాఠశాలలో ఒకరి నుంచి ముగ్గురు దాకా నియమించుకునేందుకు అవకాశం కల్పించారు. పిల్లల సంఖ్యను బట్టి వీరికి ప్రతీ నెల రూ.6 వేల నుంచి రూ.12 వేల వరకు వేతనాలు చెల్లించేందుకు ఖరారు చేశారు. కార్మికుల నియామకం సమయంలో బడి పరిసరాలు శుభ్రంగా కనిపించేవి. నెలలు గడుస్తున్నా వారికి వేతనాలు రాకపోవడంతో అపరిశుభ్రం నెలకొంది.

నియామకాలు సరిగ్గా లేదన్న ఆరోపణలు..

పారిశుధ్య కార్మికులను నిబంధనలకు విరుద్ధంగా నియమించారనే ఆరోపణలు జిల్లా స్థాయి అధికారుల దృష్టికి వెళ్లడంతో వేతన చెల్లింపులు నిలిచిపోయినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు తమకు నచ్చిన వారిని నియమించుకున్నారని, మరికొన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీ సభ్యులకు కూడా ఇచ్చినట్లు ఆరోపణలు వచ్చాయి. ఒక్కొక్కరు రెండు పనులు చేయడంపై అధికారులకు పలువురు ఫిర్యాదులు చేశారు. అయితే కొన్ని పాఠశాలల్లో తప్పులు జరిగితే అన్ని పాఠశాలల్లో పనిచేసే కార్మికులకు వేతనాలు నిలిపివేయడం సరికాదని, అక్రమంగా ఉన్న వారిని తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

త్వరలో వేతనాలు అందుతాయి..

పారిశుధ్య కార్మికులకు సంబంధించి విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు వేతనాలు అందలేదు. త్వరలోనే వస్తాయి. నియామకాల విషయంలో తప్పులు జరిగినట్లు తమ దృష్టికి రాలేదు. అలాంటిది ఏమైన ఉంటే పరిశీలిస్తాం.

- ప్రవీణ్‌కుమార్, డీఈవో మహబూబ్‌నగర్

పగిలిన మిషన్ భగీరథ పైప్‌లైన్



పగిలిన మిషన్‌భగీరథ పైప్‌లైన్, రోడ్డుపై పారుతున్న నీరు

మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : బైపాస్ నుంచి ఎదిర 4వ వార్డుకు నీటి సరఫరా చేసే మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ పగిలింది. ఆదివారం ఓ ఇంటి నిర్మాణం కోసం జేసీబీతో తవ్వకాలు చేపట్టగా, ప్రధాన పైప్‌లైన్ పగిలి నీరు రోడ్డుపై వరదలా పారింది. దీంతో ఎదిర, హౌసింగ్ బోర్డు కాలనీకి నీటి సరఫరా నిలిచిపోతుంది. అధికారులు వెంటనే మరమ్మతు చేట్టాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు.

విద్యా సంస్థల్లో ర్యాగింగ్ నేరం : ఎస్పీ

మహబూబ్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యా సంస్థల్లో ర్యాగింగ్ చేయడం నిషేధమని ఎవరైనా ర్యాగింగ్ చేస్తే చర్యలు తప్పవని ఎస్పీ జానకి ఒక ప్రకటనలో హెచ్చరించారు. ర్యాగింగ్‌లో పాల్గొనే విద్యార్థులు తక్షణమే కళాశాల నుంచి బహిష్కరణకు గురవుతారన్నారు. దీంతో పాటు క్రిమినల్ కేసులు నమోదైతే విద్య, ఉద్యోగ భవిష్యత్తు అవకాశాలపై ప్రభావం చూపుతోందన్నారు. ప్రతీ ఉన్నత విద్యాసంస్థలో యాంటీ ర్యాగింగ్ కమిటీలు, స్క్వార్డ్‌లను ఏర్పాటు చేసుకోవాలని విద్యా సంస్థలకు సూచించారు. విద్యార్థులు భయం లేకుండా ఫిర్యాదు చేయడానికి 24/7 హెల్ప్‌లైన్ నెంబర్లను అందుబాటులో ఉంచాలన్నారు. విద్యా సంస్థల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసులు ర్యాగింగ్ నిర్మూలించేందుకు కృషి చేయాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతులను అవలంబిస్తూ మోసాలకు పాల్పడుతున్నారని ఎస్పీ జానకి తెలిపారు. బ్యాంక్ ఎగ్జిక్యూటివ్‌లుగా నటిస్తూ ప్రీమియం సర్వీసులు కలిగిన క్రెడిట్ కార్డులు మంజూరు చేస్తామని చెప్పి బాధితులను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తాజాగా డీఓటీ సిమ్ వెరిఫికేషన్ పేరుతో నకిలీ బ్యాంకు స్టిక్కర్లు ఉన్న ముందే కాన్ఫిగర్ చేసిన మొబైల్ ఫోన్లను కొరియర్ చేస్తూ మోసాలకు పాల్పడుతున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయన్నారు.. బ్యాక్/డీఓటీ పేరిట వచ్చే అపరిచిత ఫోన్లు, పరికరాలు ఎప్పుడూ అంగీకరించవద్దన్నారు. వీటి విషయంలో అధికారిక హెల్ప్‌లైన్ నంబర్ల ద్వారా మాత్రమే నిర్ధారించుకోవాలన్నారు ఎస్ ఎంఎస్‌లు, డీఓటీ అలర్ట్‌ను తరుచూ తనిఖీ చేసుకోవాలని, అవి ఆగిపోతే వెంటనే అప్రమత్తం కావాలని, అనుమానాస్పద సంఘటనలు జరిగితే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి రిపోర్ట్ చేయాలన్నారు.

కృష్ణారెడ్డికి ప్రముఖుల నివాళి



కృష్ణారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే యెన్నం

చిన్నచింతకుంట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలో దమగ్నాపూర్‌లో ఆదివారం ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి తండ్రి గవినోల్ల కృష్ణారెడ్డి ప్రథమ వర్ధంతిలో పలువురు ప్రముఖులు చిత్రపటానికి ఘన నివాళి అర్పించారు. పశుసంవర్ధక యువజన, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్, మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే స్వర్ణ సుధాకర్‌రెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ మాజీ నాయకుడు మన్నె జీవన్‌రెడ్డి, ఎస్పీ జానకి పాల్గొన్నారు.

'మాకు న్యాయం చేయండి'

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విభజనకు ముందు 2006 డీఎస్సీలో నిర్వహించిన డీఎస్సీలో నాన్ లోకల్ కేటగిరి కింద 2008లో పోలిరాజు ఉపాధ్యాయుడుగా ఎంపికయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం లింగారంలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆయన భార్య రాజేశ్వరీ పోటీ పరీక్షలకు సిద్ధమైంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నిర్వహించిన డీఎస్సీలో పరీక్ష రాసి పార్వతీపురం జిల్లా స్కూల్ అసిస్టెంట్ గణిత విభాగంలో జిల్లాలో 3వ ర్యాంకు, పీఈటీ విభాగంలో జోనల్‌లో 6వ ర్యాంకు సాధించింది. ఉద్యోగం వచ్చిందన్న సంతోషం ఓ పక్క ఉండగా, భర్త పోలిరాజు బాలానగర్‌లో, రాజేశ్వరి ఏపీలోని పార్వతీపురంలో ఉద్యోగం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయమై ఆంధ్రజ్యోతి ఉపాధ్యాయుడు పోలిరాజుతో ఫోన్‌లో మాట్లాడగా రాష్ట్ర విభజనకు ముందు నాన్‌లోకల్ కింద తనకు ఉద్యోగం వచ్చిందని, విభజన తర్వాత పిల్లలు అంతా ఏపీలోని మా జిల్లాలో చదువుతున్నారు. ఇప్పుడు ఏపీలో నిర్వహించిన డీఎస్సీలో నా భార్యకు ఉద్యోగం వచ్చింది. ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు తమకు న్యాయం చేయాలి. ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా 107 మంది ఉపాధ్యాయులు ఏపీకి చెందిన వారే ఉన్నారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



ఉద్యోగులను సన్మానిస్తున్న ఆల్‌మేవా ప్రతినిధులు

మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యా వ్యవస్థలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించడం హర్షణీయమని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్‌ఫారుక్ హుస్సేన్ అన్నారు. జీహెచ్ఎంలు పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు అత్తర్‌అహ్మద్, మహ్మద్‌సమీ, మీర్జాకలీముల్లాను ఆదివారం జిల్లా కేంద్రంలోని షాసాబ్‌గుట్ట గల కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. ఉద్యోగుల ప్రతీ సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వహీద్‌షా, కోశాధికారి మహ్మద్ రశీద్, వసీం, హబీబ్, ఇష్రత్‌అలీ, ఖాజానిజాముద్దీన్, అబ్దుల్‌వాహబ్, షేక్‌ఫరీద్, మహ్మద్‌సాదిక్, జలాలుద్దీన్, మసూద్, ముజీబ్, ఖుద్రతుల్లా, పర్వేజ్‌అహ్మద్ పాల్గొన్నారు.

దేశం కోసమే ఆర్ఎస్ఎస్

నవాబ్‌పేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : దేశం కోసం ధర్మం కోసం ఆర్ఎస్ఎస్ పనిచేస్తోందని ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ కుంటి మల్లేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసి శతాబ్ది ఉత్సవాల తయారిలో భాగంగా మార్కెట్ యార్డులో సర్వస్వయం సేవకుల సమావేశం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. హిందూ ధర్మం కోసం ప్రతీ ఒక్కరు పాటుపడాలని, దసరా ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలని కోరారు. రొక్కం చంద్రమోహన్, ఉట్కూర్ కండ కర్యవాహ నర్సింహులు పాల్గొన్నారు.

ఒబెదుల్లాను కలిసిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు



ఒబెదుల్లా కొత్వాల్‌ను కలిసిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లు

మహబూబ్‌నగర్ టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్‌ను ఆయన నివాసంలో ఆదివారం ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ ఫోరం కమిటీ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు, సంయుక్త కార్యదర్శి జేఎస్‌రెడ్డి ఒబెదుల్లా కొత్వాల్‌ను తమ ఫోరంకు గౌరవాధ్యక్షుడిగా ఉండాలని కోరగా.. ఆయన అందుకు సమ్మతించారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రస్తావించగా ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి, సంస్థ ఎండీ సజ్జనార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, ప్రధాన కార్యదర్శి నష్కంటి నాగభూషణం, విశ్రాంత ఉద్యోగుల నాయకులు నారాయణ, సీహెచ్ కుమార్, బొక్క నర్సింహులు, రియాజొద్దీన్, సలీం, ఇసానుల్లా హక్, మైనోద్దీన్, బుచ్చన్న, వెంకటయ్య, వహీద్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.